ఆ సంగ్రామ యోధుడు పాండవులకు చేసిన బోధ.. ఒక విలువల రాజ్యాంగం. కొత్త నాయకుల ఎంపికకు కొలమానం కూడా. పొరపాటునో, గ్రహపాటునో అల్పబుద్ధివాడికి అధికారం ఇచ్చామా.. చచ్చామే! అదొక ఉత్పాతం. దయచేసి అలాంటి పొరపాటు చేయవద్దని ఒకటికి పదిసార్లు గుర్తు చేస్తాడు భీష్మ పితామహుడు ఓ కథ రూపంలో.. ఓ ఘోరారణ్యం. అందులో సువిశాల ఆశ్రమం. అక్కడో మహర్షి. తపోధనుడు. జీవకారుణ్యమూర్తి. సకల ప్రాణులూ ఆ ఆవరణలో నిర్భయంగా తిరిగేవి. ఆ సమూహంలో ఓ కుక్క కూడా ఉండేది. మహర్షి ఆ శునకాన్ని ప్రేమగా చూసేవాడు. ఆయన ఎక్కడికి వెళ్లినా వెన కాలే తోక ఊపుకొంటూ బయల్దేరేది. అదంతా చూసి ఓ పులికి కన్ను కుట్టింది. చంపుతానంటూ కుక్కను బెదిరించేది. ఆ బాధ తట్టుకోలేక.. నేరుగా మహర్షి దగ్గరికి వెళ్లి గోడు వెళ్లబోసుకున్నది కుక్క. దీంతో ఆ రుషి పుంగవుడు.. ఆ కుక్కను పులిలా మార్చి పులి పట్ల ఉన్న భయాన్ని పోగొట్టాడు. ఆ తర్వాత, ఏను గులా మార్చి ఏనుగులంటే ఉన్న భయాన్ని పోగొ ట్టాడు. ఇంకో సందర్భంలో సింహంలానూ మార్చాడు. సరిగ్గా అప్పుడు ఆ శునకం తన కుక్కబు ద్ధిని ప్రదర్శించింది. 'ఈ రుషిని కనుక చంపేస్తే.. నేను శాశ్వతంగా సింహంలా దర్జాగా బతికేయవచ్చు కదా' అనుకుంది మనసులో. ఆ కుట్రను గ్రహించిన మహర్షి.. క్షణమైనా ఆలస్యం చేయకుండా మళ్లీ దాన్ని కుక్కలా మార్చాడు. ఆశ్రమం నుంచి తరిమేశాడు కూడా. అర్హతలేని వారిని అందలమెక్కిస్తే.. ఆ చేయి భస్మాసుర హస్తమే! మనల్ని ముంచేస్తుంది. వద్దు. ఆ పొరపాటు చేయొద్దు. ఇప్పుడిప్పుడే కోలు కుంటున్నాం. కుదుటపడుతున్నాం. పోరాడి సాధిం చిన తెలంగాణను ఢిల్లీ సామంతరాజ్యం చేస్తామా? కష్టపడి నిర్మించుకున్న అభివృద్ధి సౌధాన్ని పందికొక్కు ల పాలు చేస్తామా? శ్రమించి పోగేసుకున్న సంప దను.. ఉత్తరాది పెద్దలకు కప్పంగా కడతామా? వద్దు. కలలోనైనా ఆ ఆలోచన వద్దు. ఇది భీష్ముడి హుకుం.

నాయకుడికి శీల సంపద ఎంత ముఖ్యమో మరో కథలో బోధిస్తాడు పితామహుడు. ఓ సారి ప్రహ్లాదుడి దగ్గరికి మారువేషంలో వెళ్తాడు ఇంద్రుడు. అతిథి సేవ లతో సన్మానించి, 'ఏం కావాలో కోరుకో దేవరాజా?' అంటాడు ప్రహ్లాదుడు. 'నీ శీలాన్ని నాకు ఇవ్వు' అని కోరతాడు ఇంద్రుడు. సంతోషంగా ఇచ్చేస్తాడు ప్రహ్లా దుడు. కానీ, శీలంతో పాటు ధర్మం, సత్యం, సత్ప్రవ ర్తన, బలం, సంపద కూడా వెళ్లిపోతాయి. 'ఇదేమి టమ్మా! నువ్వు కూడా..' అని సంపదతో వాపోతాడు ప్రహ్లాదుడు. 'శీలం లేని చోట నేనెందుకు ఉంటాను నాయనా' అని సమాధానం ఇచ్చి ముందుకు సాగు తుంది సంపదల తల్లి. 'కాబట్టి, పాలకులకు శీల సంపదే ప్రాణం' అంటూ ముక్తాయిస్తాడు భీష్ముడు. ఆయా పార్టీల నాయకులను బేరీజు వేస్తున్నప్పుడు శీలాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. అతని గతం తవ్వితీయాలి. నోటుకు ఓటు, వెన్నుపోటు వగైరా చరిత్రలు ఉన్నాయేమో గమనించాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏ పాత్రాలేని అపాత్రులను ఆమడదూరం ఉంచాలి. ఆ నేతలను రిమోట్ కంట్రోల్‌తో ఆడిస్తున్న సూత్రధారులు ఎవరన్నది పసి గట్టాలి. విష వృక్షాన్ని పెకిలించినట్టు.. ఓటుతో గొడ్డలి వేటు వేయాలి. అలాంటివారిని భీష్ముడు తన కూన లను తానే చంపి తినే పులులతో పోలుస్తాడు.

## చాణక్య సూత్రాలు

**మౌర్య సామ్రాజ్యం మొదలు నిన్నమొన్నటి సంస్థానాల వరకు.. ఆర్యావర్తంలో చాణక్యుడి అర్థశాస్త్రమే పాలన గ్రంథం. ఆ సూత్రాల ఆధారంగానే ధర్మబద్ధమైన పాలన సాగింది. ప్రజలు సుఖ సంతోషాలతో కాలం గడిపారు.**



- సింహం ఎంగిలి మెతుకులు ఇష్టపడదు. నిజమైన పాలకుడు దొడ్డిదారి సంపాదనకు ఆశపడడు.
- రాజు మితంగా భోంచేయాలి, అమితంగా ఆలోచించాలి. అతి తిండి వల్ల మగత కమ్ముతుంది.
- ప్రియవాదినో న శత్రుః.. నోరు మంచిదైతే రాజ్యమూ మంచిది అవుతుంది.
- యో యస్మిన్ కర్మణి కుశలః తం తస్మిన్నేవ నియోజయేత్ .. ఎవరు ఏ రంగంలో ప్రవీణులో, వారికే ఆ బాధ్యతనివ్వాలి.
- అధికారం రాజధాని నుంచి పల్లెకు విస్తరిం చాలి. సంపద పల్లెల నుంచి మొదలుపెట్టి పట్టణాల మీదుగా రాజధాని చేరాలి.
- విభావానురూపం ఆభరణః.. మనం ధరించే వస్త్రాలు మన ఆర్థిక స్థితికి మించి ఉండకూడదు.
- మూర్ఖులతో శత్రుత్వం ప్రాణాంతకం. మిత్రులతో గొడవలు నష్టదాయకం. గురువులతో వైరం పతనానికి సంకేతం.
- తపస్సుకు ఒంటరిగా.. విద్యలకు ఇద్దరితో, సంగీతం నేర్చుకోవడానికి ముగ్గురితో, కొత్త ప్రదేశానికి నలుగురితో, సేద్యానికి ఐదుగు రితో, పోరాటానికి పదిమందితో వెళ్లాలి.
- బాణం ఒక ప్రాణాన్ని బలిగొంటుంది, వ్యూహం పదివేలమందిని ఒకేసారి నేల కూలుస్తుంది.
- నేలమీద మొసలిని ముసలి కుక్క కూడా బరబరా లాక్కెళ్లిపోతుంది. అదే మొసలి మడుగులో ఉంటే.. మదగజాన్ని అయినా బంధించగలదు. స్థాన బలం అలాంటిది.
- కొన్నిసార్లు ధర్మం అధర్మంలా, అధర్మం ధర్మంలా కనిపిస్తుంది. వివేకంతో నిర్ణయం తీసుకోవాలి.

కర్మలు రెండు రకాలని చెబుతాడు కురు పితామ హుడు. ఒకటి.. ఇష్టకర్మలు, రెండు పూర్త కర్మలు. అగ్నిహోత్రం, తపస్సు, ఆతిథ్యం మొదలైనవి ఇష్టక ర్మలు. జలాశయాలు నిర్మించడం, ఆలయాలు కట్టించడం, నిరుపేదలను ఆదుకోవడం పూర్తకర్మలు. పాలకుల ప్రధాన బాధ్యత.. పూర్తకర్మలని వివరిస్తాడు భీష్ముడు. కేసీఆర్.. అటు ఇష్టకర్మలు, ఇటు పూర్తక ర్మలు సమర్థంగా నిర్వహిస్తున్న రాజయోగి. అతిసా మాన్యులను కూడా తన ఇంటికి పిలిపించి కొసరి కొసరి విందులు వడ్డించిన ఉదంతాలు అనేకం. రాజ్య శ్రేయస్సు కోసం అయుత చండీ హోమాలు, రాజశ్యామల యాగాలు జరిపించే పరమ ధార్మికుడా యన. తెలంగాణ సమాజం కోసం కేసీఆర్ సాగించే అంతర్మథనమే ఓ పెద్ద తపస్సు. కాళేశ్వరం ప్రాజెక్టు, యాదగిరి గుట్ట తేజస్సు.. పూర్త కర్మల పరిపూర్ణ ఫలాలే. కాబట్టే, 'తాతా! ఒక ఉత్తమ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలేమిటి?' అని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు ఆ సంగ్రామ సింహుడు ఇచ్చిన జవాబులో మనకు కేసీఆర్ వ్యక్తిత్వమే కనిపిస్తుంది. 'నిండైన వ్యక్తిత్వం, నిష్కళంక చరిత్ర, స్థితప్రజ్ఞత, ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం, చొరవ, కార్యజ్ఞానం, కర్తవ్య జ్ఞానం'.

* * *

భీష్మ, విదుర, చాణక్య.. ముగ్గురూ మళ్లీ భూలోకానికి వస్తే? తప్పక తెలంగాణనే సందర్శి స్తారు. గంగా సుతుడైన భీష్మ పితామహుడు.. కాళేశ్వరం ఒడ్డున కుటీరం నిర్మించుకుంటాడు. ధర్మ పక్షపాతి అయిన విదురుడు ముఖ్యమంత్రి నివాసాన్ని తన ఆవాసంగా మార్చుకుంటాడు. పాలన శాస్త్రం మీద పట్టు కలిగిన చాణక్యుడు అత్యద్భుతంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కేంద్రంగా చేసుకుని చాణక్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పేరుతో శిక్షణ కేంద్రాన్ని స్థాపిస్తాడు. రేపటి నేతలను తీర్చిదిద్దు తాడు. పోలింగ్ రోజున ముగ్గురూ వెళ్లి కారు గుర్తుకు ఓటేసి వస్తారు. మూడు స్వరాలూ కూడి కల్వకుంట్ల చంద్రశేఖర రావును నిండుమనసుతో ఆశీర్వదిస్తాయి.

**విజయోస్తు.**
**దిగ్విజయోస్తు.**
**పునర్**
**అధికార**
**ప్రాప్తిరస్తు.**

